క్లుప్తంగా

రీ సర్వేతో భూ రికార్డుల నవీకరణ

గూడూరు: ప్రభుత్వం చేపట్టిన ఆంధ్రప్రదేశ్ భూ సర్వే ప్రాజెక్టు ద్వారా రెవెన్యూ రికార్డుల నవీకరణ జరుగుతుందని కలపటం సర్పంచ్ ఐనాల దేవ నాగ శ్రీనివాస్ అన్నారు. కలపటం పంచాయతీలో శుక్రవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు అందరూ రీ సర్వే అధికారులకు అందుబాటులో ఉండి తమ రికార్డులు సమర్పించాలన్నారు. తద్వారా భూ రికార్డుల నవీకరణలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉంటాయన్నారు. రీ సర్వే ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు వివాదాలకు ఆస్కారం ఇవ్వకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ కె.సాయి, మండల సర్వేయరు కె.మురళీకృష్ణ, వీఆర్వో వెంకటేశ్వరరావు, గ్రామ సర్వేయరు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం తనిఖీ చేసిన సీఈఓ

గూడూరు: గూడూరు మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ కె.కన్నమనాయుడు శుక్రవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలలో భాగంగా మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన కన్నమనాయుడు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణపై ఎంపీడీఓ బి.రాజేశ్వరి, ఏఓ వనజలకు పలు సూచనలు చేశారు. మండల పరిధిలో నిర్మించిన రహదారుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యంగా దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం చేసే ట్రాక్టర్లను గుర్తించి వాటి యజమానులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.రాజేశ్వరి, పీఆర్ ఏఈ కె.జవహర్, ఏఓ వనజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థిని కుంపటి సిరిలతకు ఉన్నత చదువుల కోసం శుక్రవారం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పోలుకొండ భానుతేజ, లలితశ్రీ దంపతుల సహకారంతో ఈ మొత్తాన్ని సిరిలతకి ఫౌండేషన్ నిర్వాహకులు అందజేశారు. నగరానికి చెందిన కుంపటి జయశ్రీకి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భర్త లేని ఆమె అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ఓ మార్ట్‌లో పని చేస్తూ తనకు వచ్చిన కొద్ది జీతంతో కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె పెద్ద కుమార్తె సిరిలత నర్సింగ్ కోర్సు చదివేందుకు ఫీజుకు డబ్బులు లేక చదువు ఆపి వేయడంతో ఆమె చదువు కొనసాగించేందుకు ఈ ఆర్థిక సహాయం చేసినట్లు భానుతేజ, లలితశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ బాషా, సభ్యులు అంకాల రామకృష్ణ, ఖాజా, సప్పరపు పుష్ప తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

పెనమలూరు: బాలికలు భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని మహిళా సంరక్షణ కార్యదర్శి డి.వికల్ప అన్నారు. వణుకూరు గ్రామంలో శుక్రవారం పాఠశాల బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. వికల్ప మాట్లాడుతూ బాలకలపై ఎవరైనా అభ్యంతర కరంగా వ్యవహరిస్తే వెంటనే తల్లితండ్రులకు తెలపాలన్నారు. అవసరమైతే 112, 1931,1098 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ పీసీ పి.మల్లిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు గట్టు ఆక్రమణను తొలగించాలి

కోడూరు: మండలంలోని ముందడుగు గ్రామంలో ఆక్రమణకు గురైన చెరువు గట్టును పరిరక్షించాలని గ్రామస్తులు శుక్రవారం పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందించారు. గ్రామస్తులతో పాటు పశువుల అవసరాల కోసం వినియోగించే చెరువుకు సంబంధించిన గట్టును కొంతమంది ఆక్రమణదారులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు అధికారుల వద్ద వాపోయారు. వెంటనే ఆక్రమణలు తొలగించి, గట్టును పటిష్ఠపర్చాలని కోరారు. సర్పంచి వెన్నా షైనీ, ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శి శేషగిరిరావుకు వినతిపత్రం అందించారు.

పాత వాహనాల వేలం

చిలకలపూడి(మచిలీపట్నం): నిరుపయోగంగా ఉన్న, వాడుకలో లేని నాలుగు చక్రాల వాహనాలను ఈ నెల 10వ తేదీన బహిరంగంగా వేలం వేయనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో నిరుపయోగంగా ఉన్న 12 వాహనాలను 10వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 98499 03967 సంప్రదించాలని పేర్కొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సనకా ప్రశాంత్

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన సనకా ప్రశాంత్‌ను బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ జిల్లా ఎన్నికల పరిశీలకుడు రామినేని వెంకటకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రశాంత్‌కు నియామక పత్రం అందజేసి అభినందనలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చిరువోలు బుచ్చిరాజు, నందూరి రాజేంద్రకుమార్, తుంగల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మా ఊరికి బస్సేది ?

పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలు అని సూక్తులు వల్లించడమే తప్ప ఆచరణలో పల్లెటూళ్లు ఎటువంటి అభివృద్ధికి నోచుకోక మూగంగా రోదిస్తున్నాయి. అభివృద్ధి అంతా నగరాల్లో కేంద్రీకృతమై పోతోంది. స్వాతంత్య్రం సిద్ధించి 77 ఏళ్లు కావస్తున్నా చాలా గ్రామాలకు కనీసం బస్సు సౌకర్యం కూడా లేకపోవడం మన పల్లెల దౌర్భాగ్య స్థితికి అద్దం పడుతోంది.

- ఏళ్ల తరబడి బస్సు సౌకర్యం లేని గ్రామాలు
- ప్రయాణాలకు ఆటోలే దిక్కు
- పాలకులారా... పట్టించుకోండని మొర


ఇంతేరు గ్రామం

కృత్తివెన్ను: మండలంలోని ఇంతేరు, గొల్లగూడెం, చంద్రాల, దోమనగొంది గ్రామాలకు ఆర్టీసీ సేవలు ఇప్పటికీ అందడం లేదు. వీటిలో ముఖ్యంగా ఇంతేరు గ్రామం సముద్రానికి కూతవేటు దూరంలో ప్రధాన గ్రామాలకు సుదూరంలో ఉన్న పల్లెటూరు. గతంలో కొన్నాళ్లపాటు కొనసాగిన ఆర్టీసీ సేవలు ఆ తర్వాత నిలిచిపోయాయి. దీంతో ఇంతేరు గ్రామస్తులు ఆర్టీసీ బస్సు కోసం దాదాపు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రపంచమే కుగ్రామమైన ఈ రోజుల్లో తాము మాత్రం ఇంకా ఆర్టీసీ బస్సు కోసం ఎదురు చూడాల్సి రావడం తమ దౌర్భాగ్యమంటూ పంచాయతీలోని మూడు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రంతో పాటు దాని అనుసంధాన పాయల్లో నిత్యం బతుకుతెరువు కోసం చేపల వేటనే ప్రధాన వృత్తిగా చేసుకున్న గంగపుత్రులు అత్యధికంగా ఉన్న ఇంతేరు గ్రామంపై ఆర్టీసీ కరుణా కటాక్షణాలు ప్రసరించేది ఇంకెప్పుడోనని ఆ గ్రామస్తులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణపై అధికారులకు అర్జీల రూపంలో అనేకసార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు.

ఏళ్ల తరబడి ఎదురుచూపులే...

మండల పరిధిలోని ఇంతేరు గ్రామ పంచాయతీలో ఇంతేరుతో పాటు, సత్రవపాలెం, పార్వతీపురం అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ దాదాపు రెండు వేల మంది జనాభా ఉన్నారు. అధికంగా మత్స్యకార ప్రజలు నివసించే ఈ గ్రామంలో ఏ చిన్న అవసరం వచ్చినా 12 కిలోమీటర్ల దూరంలోని బంటుమిల్లికి వెళ్లాల్సిందే. తాము వేటాడిన చేపలను మార్కెట్‌కు తరలించి అమ్ముకోవాలన్నా, ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాలకు వెళ్లాలన్నా, విద్యార్థులు కళాశాలకు వెళ్లాలన్నా, వృద్ధులు, గర్భిణులు ఆస్పత్రికి వెళ్లాలన్నా ఆటోలే దిక్కు. ఇప్పటికైనా తమ గ్రామానికి ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే తరహాలో చందాల, దోమనగొంది గ్రామాలకు సైతం ఆర్టీసీ సేవలు లేవు.

సగం మాత్రమే పూర్తయిన రహదారి...

గ్రామాన్ని చేరేందుకు నిర్మించిన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీనిపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఓఎన్‌జీసీ నిధుల ద్వారా చినపాండ్రాక నుంచి సత్రవపాలెం వరకు రోడ్డు నిర్మాణం జరిపారు. మరో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తి అధ్వానంగా ఉంది.


అధ్వానంగా ఉన్న ఇంతేరు ప్రధాన రహదారి

సురక్షిత ప్రయాణం అందించాలి



రోజూ ఆటోలలో ప్రయాణించాలంటే భయంగా ఉంటోంది. సురక్షిత ప్రయాణంగా భావించే ఆర్టీసీ సేవలను మా గ్రామానికి కూడా అందించేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాలి.

– కె.భాస్కరరావు, సత్రవపాలెం

భయం భయంగా ప్రయాణం



ఆటోలలో ప్రయాణాలంటే భయంగానే ఉంటుంది. రోజూ పాఠశాలల, కళాశాలలకు వెళ్లే వారే కాకుండా నిత్యం వివిధ పనులపై సెంటర్‌కు వెళ్లే వాళ్లకు సరైన వాహన సౌకర్యం లేదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలి.

– పెదసింగు మోకమ్మ, సర్పంచ్, ఇంతేరు

వరికుప్పలకు నిప్పు పెట్టడం హేయం

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


బాధిత రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంట కుప్పలకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని నక్కవానిదారి గ్రామంలో ఇటీవల ఇద్దరు రైతులు అప్పికట్ల వెంకటేశ్వరరావు, అప్పికట్ల నాంచారయ్యకు చెందిన వరికుప్పలకు దుండగులు నిప్పు పెట్టడంతో బాధిత రైతులను రమేష్‌బాబు శుక్రవారం స్థానిక పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. నక్కవానిదారి గ్రామంలో ప్రతి ఏటా ఈ విష సంస్కృతి కొనసాగుతోందని, పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను పట్టుకోవాలన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అప్పికట్ల వీరాంజనేయులు కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీలు దాసరి వెంకటేశ్వరరావు, బడే గంగాధరరావు, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కష్టంలో ఉన్న ఆడబిడ్డకు అండగా నిలిచా..

- అధికార దుర్వినియోగానికి పాల్పడలేదు
- కారులో జయసుధను స్టేషన్‌కు తీసుకెళ్తే తప్పేంటి
- నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్

మచిలీపట్నంటౌన్: రేషన్ బియ్యం మాయం కేసుకు సంబంధించిన మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) సతీమణి జయసుధ విచారణ సమయంలో తాను అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు వచ్చిన వార్తలను మచిలీపట్నం నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలువురు మహిళా కార్పొరేటర్‌లతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నానికి శుభాకాంక్షలు తెలిపేందుకు బుధవారం తాను, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్‌లతో కలసి ఆయన నివాసానికి వెళ్లామని, ఆ రోజే పోలీసులు జయసుధను తాలూకా పోలీస్‌స్టేషన్‌కు విచారణకు హాజరుకావాలని కోరటంతో ఆమెను తన కారులో ఎక్కించుకుని పోలీస్‌స్టేషన్‌కు తోడుగా వెళ్లానన్నారు. మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ కేసు విచారణ సమయంలో మంత్రి కొల్లు రవీంద్ర సీఐ కె.ఏసుబాబుకు అనేకసార్లు ఫోన్ చేసి విచారణకు వచ్చారా.. అన్ని ప్రశ్నలూ అడిగారా.. సమాధానాలు పూర్తి స్థాయిలో రాబట్టండి అంటూ ఒత్తిడికి గురి చేశారన్నారు. తన భర్త మోకా భాస్కరరావును హత్య చేయించిన కేసులో నాడు కొల్లు రవీంద్ర జైల్‌కు వెళ్లాడని, దీంతో కక్ష కట్టిన ఆయన పేర్ని నాని కుటుంబాన్ని కూడా కేసుల్లో ఇరికించి జైలుపాలు చేసేందుకు కుట్ర పన్నాడని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, పలు డివిజన్‌ల మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలించిన సీఈవో


తరకటూరు సామూహిక రక్షిత నీటి పథకంలో నీటి శుద్ధి ప్రక్రియను పరిశీలిస్తున్న సీఈఓ కన్నమనాయుడు

గూడూరు: వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని జిల్లా పరిషత్ సీఈఓ కె.కన్నమనాయుడు తెలిపారు. తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకును శుక్రవారం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో కలసి పరిశీలించి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తరకటూరు సామూహిక రక్షిత నీటి పథకంలోని నాలుగు శాండ్ ఫిల్టర్ బెడ్ల ద్వారా 40 లక్షల లీటర్ల నీరు ప్రతిరోజూ శుద్ధి చేసి సరఫరా చేయాల్సి ఉండగా, ప్రస్తుతం రెండు ఫిల్టర్ బెడ్ల ద్వారా మాత్రమే పూర్తి స్థాయిలో నీటిని శుద్ధి జరుగుతుందన్నారు. దీంతో పాటుగా పలు గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్న పైప్‌లైన్లు శిథిలమై నీరు వృథా అవుతోందన్నారు. ఫిల్టర్ బెడ్ల ఆధునికీకరణ, పైప్‌లైన్ నవీకరణ కోసం ప్రభుత్వం రూ.3కోట్లు కేటాయించిందన్నారు. ప్రస్తుతం పనులు టెండర్ దశలో ఉన్నాయని, వీలైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేసి వచ్చే వేసవి నాటికి తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి పూర్తి స్థాయిలో నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని సీఈవో వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ నటరాజ్, ఏఈ నాగరాజు, ఎంపీడీఓ బి.రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, తరకటూరు, జక్కంచర్ల, కలపటం, సర్పంచ్‌లు చిన్నం వెంకట రమణమ్మ, ఆత్మూరి వెంకట రమణ, ఐనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి ప్రతిరూపం సావిత్రిబాయి పూలే


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకుడు కేవీవీ సత్యన్నారాయణ

మచిలీపట్నంటౌన్: అవిద్య, అంటరానితనం, మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, మానవత్వం మూర్తీభవించిన మహా మనీషి సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పలువురు బీసీ సంక్షేమ సంఘ నాయకులతో కలసి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందంటూ తన భర్త పూలేతో కలిసి దేశంలోనే తొలి బాలికల పాఠశాలను స్థాపించి, తొలి ఉపాధ్యాయినిగా ఖ్యాతి గడించారన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు టి.రాజ్యలక్ష్మి, రాగి చంద్రశేఖర్, గడ్డం కిషోర్, బోలెం వెంకటేశ్వరరావు, పి.సురేష్, భోగిరెడ్డి దుర్గారావు, వై.ఆనంద్, వి.ప్రసాద్, జయరాం, శివ పార్వతి, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆమె జీవితం మహిళలకు ఆదర్శం

నాగాయలంక: ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం, ఎంపీటీసీ సభ్యుడు లంకె శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బోసుబొమ్మ కూడలిలో శుక్రవారం భారత తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం జరిగింది. సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు, ఎదురుమొండి ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్, బీసీ సంఘాల నాయకులు నాగిడి తాతారావు, కారాని ధనుంజయ, విశ్వనాథపల్లి వెంకటస్వామి, సోమేశ్వరరావు, నాగిడి పోతురాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.


కోడూరులో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నేతలు

గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే

కోడూరు: అణగారిన వర్గాల ప్రజల కోసం అనేక సేవలందించిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు కొండవీటి సురేష్ అన్నారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక రవితేజ పబ్లిక్ స్కూల్‌లో కూడా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్లో ప్రిన్సిపాల్ కొరివి అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పెడన విద్యార్థులు


రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనతో విద్యార్థులు, ఉపాధ్యాయురాలు, హెచ్‌ఎం అశోక్‌కుమార్

పెడన: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పెడన భట్లా జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం అద్దంకి అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో గురువారం కృష్ణాజిల్లా స్థాయి ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు కె.హేమ, వైకే జానుశ్రీ , ఉపాధ్యాయురాలు కె. లక్ష్మీదేవి ప్రదర్శించిన 'స్మార్ట్ కల్టివేషన్ ప్రాజెక్టు' గ్రూపు ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మచిలీపట్నం ఉప విద్యాశాఖాధికారి శేఖర్ సింగ్, ఎంఈవో–2 హరనాథ్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో నాగాయలంక విద్యార్థుల సత్తా

నాగాయలంక: జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గ్రూపు విభాగంలో ఫార్మ్‌వైర్ ప్రాజెక్టు ప్రదర్శనతో విశేష ప్రతిభ చాటిన స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి బాలికలు పుట్టి సౌమ్య, అద్దంకి జీవన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం పీవీఎస్‌వీ ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. గుడివాడ మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన 25 మండలాల జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో 50 మంది విద్యార్థులు పాల్గొనగా నాగాయలంక బాలికల ప్రదర్శన ఎంపికైంది. ఈనెల రెండో వారంలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఈ బాలికలు పాల్గొంటారని గైడ్ టీచర్ కొమ్మినేని ఉదయ కుమార్ చెప్పారు.

6న డిజిటల్ క్లాస్‌రూమ్స్ ప్రారంభం

మోపిదేవి: పాఠ్యాంశాలపై విద్యార్థులకు సమగ్రమైన అవగాహన, వ్యక్తిత్వ వికాసం కల్పించేందుకే డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారి దొమ్మరాజు చంద్రశేఖర్ రాజు తెలిపారు. మోపిదేవి మత్స్యకార బాలుర ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 6న రాష్ట్రంలో తొలిసారిగా మోపిదేవి మత్స్యకార బాలుర ఆశ్రమ పాఠశాల వసతిగృహం నుంచే నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్‌ను బీసీ సంక్షేమశాఖ, జౌళి, చేనేత పరిశ్రమల శాఖ మంత్రి సవిత ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.లక్షతో డిజిటల్ రూమ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 43 వసతి గృహాలకు గానూ 24 వసతి గృహాలకు రూ.3.38 కోట్లతో మరమ్మతు పనులు, రంగులు వేస్తున్నట్లు తెలిపారు. అందులో మోపిదేవి ఆశ్రమ పాఠశాలకు 19.35 లక్షలు నిధులు మంజూరైనట్లు వివరించారు. బీసీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ ఆర్.శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధికారి జి.రమేష్, వెనకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి దివ్య, స్థానిక పాఠశాల వార్డెన్ కుంభా లంకేశ్వరావుతో పాటు నియోజకవర్గంలోని పలువురు వార్డెన్‌లు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న పోలీస్ సెలక్షన్ ఈవెంట్స్‌లో పరుగు పందెంలో పాల్గొని అస్వస్థతకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించిన ధారావతు చంద్రశేఖర్ (25) కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీ వద్ద ఉన్న చంద్రశేఖర్ భౌతికకాయాన్ని శుక్రవారం మధ్యాహ్నం ఆయన సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా గిరిజన, పోలీస్ శాఖల తరఫున చెరో రూ.25 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. చంద్రశేఖర్ కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయన స్థానిక బెల్ గెస్ట్ హౌస్ లో అదనపు ఎస్పీ వివి నాయుడు, బందరు ఆర్డీవో కే స్వాతి, తహసీల్దార్ మధుసూదనరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ముదిగొండ ఫణి ధూర్జటి తదితర అధికారులతో చంద్రశేఖర్ మరణానికి గల కారణాలు, ఇతర అంశాలపై చర్చించారు.

తెలుగురావుపాలెం డొంక రోడ్డును అభివృద్ధి చేయాలి

కొడాలి(ఘంటసాల): రైతుల ఇబ్బందులను గుర్తించి తెలుగురావుపాలెం డొంకరోడ్డును రబ్బీషు రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుతూ సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు శుక్రవారం జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఘంటసాల మండలం తెలుగురావుపాలెం పంచాయతీ కార్యాలయం నుంచి గుండేరు వైపు ఉన్న జిల్లా పరిషత్ పరిధిలోని సుమారు 2 కి.మీ. డొంక మట్టిరోడ్డు ఉంది. ఆ రోడ్డుకు ఇరువైపులా ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, బాపట్ల జిల్లా గాజుల్లంక గ్రామాలకు చెందిన సుమారు 900 ఎకరాల మాగాణి పొలాలు ఉన్నాయి. ఆ రోడ్డు గుంతల మయంగా మారిపోవడంతో రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

మినుములో కలుపు యాజమాన్యంపై శిక్షణ

దాలిపర్రు(ఘంటసాల): మినుము పంటలో రెండు లేదా మూడు ఆకుల దశలోనే కలుపు నివారించుకోవాలని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం ఘంటసాల మండలం దాలిపర్రు గ్రామంలో శుక్రవారం వరి మాగాణి మినుములో కలుపు యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకట లక్ష్మి కలుపు నివారణ పద్ధతులను సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోకిపర్తి శాంత కుమారి, వీఏఏ సత్యదేవ్, రైతులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని తాడేపల్లి గ్రామంలో మినుము పంట క్షేత్రస్థాయి సందర్శన చేశారు.

పుచ్చగడ్డలో...

మినుము పంటలో సమయానుకూల సస్యరక్షణ కీలకమని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. చల్లపల్లి మండలంలోని పుచ్చగడ్డ, రామానగరం గ్రామాల్లో మినుము పంటలను కేవీకే శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పంటలో పొగాకు లద్దె పురుగు ఉధృతి అధికంగా గమనించామని, దీని నివారణకు వేప సంబంధిత మందులను ఎకరానికి ఒక లీటరు చొప్పున పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి, వీఏఏ సుబ్రహ్మణ్యేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

కిశోర బాలికా వికాసంపై కార్యక్రమం

కృత్తివెన్ను: కిశోర బాలికల ఆరోగ్యం, రక్షణ, చదువు మొదలైన అంశాలపై కిశోర వికాసం పేరుతో కార్యక్రమాన్ని శుక్రవారం ఇంతేరులో నిర్వహించారు. దీనిలో భాగంగా బాలికల రక్షణ, అక్రమ మానవ రవాణా, నాణ్యమైన ఆహారం, రుతుస్రావం సమయంలో పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్యవివాహాలను అరికట్టుట మొదలైన అంశాలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, స్థానిక పెద్దలు, విద్యార్థులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఘంటసాల ముందంజలో ఉండాలి

ఘంటసాల: ఉపాధి పనుల్లో ఘంటసాల మండలాన్ని ముందంజలో ఉంచాలని ఎంపీడీవో డి. సుబ్బారావు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి తెలిపారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తూ, సక్రమంగా కూలి డబ్బులు చెల్లించేలా చూడాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీవోను ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెనుమాక బాల సుబ్రహ్మణ్యేశ్వరరావు (బాలు)ను ఎంపీడీవో సుబ్బారావు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

గోడ కూలి కార్మికుడికి గాయాలు

కోనేరుసెంటర్: ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న గోడ కూలి ఓ కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనుల నిమిత్తం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహేంద్రకుమార్ అనే భవన నిర్మాణ కార్మికుడు రెండు నెలల క్రితం మచిలీపట్నం వచ్చాడు. రోజులానే శుక్రవారం ప్లాస్టింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి అతనిపై పడింది. ఈ ఘటనలో రాజేంద్రకుమార్ కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కాళ్లు రెండు విరగటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు.